


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :145 | బుధవారం సెప్టెంబర్ 16,2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 8 | వెల-5

## యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా?:



- యూపీఐ ఛార్జీలపై కాంగ్రెస్ ఆగ్రహం.
- ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా? అని ప్రశ్న.
- రూ.2,000 దాటిన చెల్లింపులపై ఫీజులకు మార్గం.
- అమెరికా కంపెనీల ఒత్తిడికి కేంద్రం తలొగ్గుతోందని ఆరోపణ.
- సామాన్యులపై అదనపు భారం వద్దని డిమాండ్.

మిగతాది 2లో

## జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమే: నిర్మలా సీతారామన్

### జెన్ జీ, జెన్ ఆల్ఫా నాయకత్వంలోకి రావాలి.



- యువత ఆశయాలను వినేందుకు దేశం సిద్ధమని నిర్మలమ్మ.
- దేశం కోసం ఏం చేశామో ఆలోచించుకోవాలని సూచన.
- దేశ ప్రయోజనాల్లో ఎప్పుడూ రాజీ పడొద్దని పిలుపు.
- ప్రపంచ ఘర్షణల మధ్య భారత్ 7.8% వృద్ధి నమోదు.
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని యువతకు సూచన.

మిగతాది 2లో



మిగతాది 2లో

## ఆ కుటుంబంలో ఐదుగురు తోబుట్టువులకు.. నీట్‌లో సీట్లు

- చదువుకోవాలనే తపన, సాధించాలనే సంకల్పం ఉండాలే గానీ.. ఏ లక్ష్యమైనా చేరుకోవచ్చని నిరూపించారీ తోబుట్టువులు.

## అగాఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం: సీఎం రేవంత్‌రెడ్డి

### ప్రిన్స్ రహీమ్ అగాఖాన్-ఎతో సీఎం భేటీ.



- గ్లోబల్ సమిట్‌కు రావాలని ఆహ్వానం.
- వారసత్వ సంపద పునరుద్ధరణలో ఫౌండేషన్ కీలక పాత్ర.
- మూసీ పునరుజ్జీవానికి ప్రణాళికలు సిద్ధం.
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరణకు సాయం కోరుతున్న ప్రభుత్వం.
- డిసెంబర్ 7--9న ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమిట్.

హైదరాబాద్: తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగాఖాన్-ఎతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. గ్లోబల్ సమిట్‌కు హాజరుకావాలని ఆయన్ను సీఎం ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అగాఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవముందని చెప్పారు. "వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగాఖాన్ ఫౌండేషన్‌ది అత్యంత కీలకపాత్ర. ఫౌండేషన్ సాయంతో మండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించుకున్నాం. మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు సాయం కోరుతున్నాం. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమిట్ నిర్వహిస్తున్నాం. 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు"అని సీఎం తెలిపారు.

## రష్యాపై ఆంక్షల బిల్లులో భారత్ పేరు..

### ట్రంప్ సర్కార్‌కు ప్రతిపాదన



రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా టారిఫ్‌ల ప్రతిపాదన.

- ఆంక్షల బిల్లులో భారత్ పేరును చేర్చాలని ప్రతిపాదన.
- భారత్‌తో పాటు చైనా, తుర్కియే సహా 10 దేశాల పేర్లు.
- ఈ దేశాలపై 100% టారిఫ్‌లకు ప్రతిపాదన.
- రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా కొత్త బిల్లు.
- సెనెట్‌లో బిల్లు ఇప్పటికే 86-11తో ఆమోదం.
- ప్రతినిధుల సభ ఆమోదం, అధ్యక్షుడి సంతకంతో చట్టం.

మిగతాది 2లో

## సీఎం రేవంత్‌రెడ్డితో నాకు గొడవల్లేవ్: మహేశ్‌కుమార్ గౌడ్




మిగతాది 2లో

## కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదు: చంద్రబాబు

### నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై కఠిన చర్యలు.



- అభ్యర్థులను రాజకీయ ఆందోళనలకు వినియోగిస్తే చర్యలు.
- కోచింగ్ సెంటర్లపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలి.
- అభ్యర్థులు పరీక్షలపైనే దృష్టి పెట్టాలి.
- అక్టోబర్ 3న విజయవాడలో పాన్ఐఐటీ ఏపీ సమ్మిట్.
- ఏఐ, క్వాంటమ్, డీప్‌టెక్ రంగాలపై దృష్టి.

మిగతాది 2లో



మిగతాది 2లో

## నేను చెప్పేవి అబద్ధాలైతే.. రాజకీయాల నుంచి వైదొలగుతా: మాధవరం కృష్ణారావు

## ఏపీలో పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు



మిగతాది 2లో

- ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 16,2026

# సంపాదకీయం

## ప్రత్యామ్నాయ సౌందర్యశాస్త్రం

కాలం మారినా సమాజం మారినా తరాలు మారినా సాహిత్యాన్ని చూసే చూపు కూడా మారినా, కొన్ని పుస్తకాలు పాతబడవు. వాటిలోని ప్రశ్నలు ప్రతి కొత్త కాలంలో కొత్త అర్థంతో మన ముందుకు వస్తూనే ఉంటాయి. పాతికేళ్ళక్రితం వెలువడిన 'వెంటాడే కలాలు -- వెనుకబడిన కులాలు' అలాంటి సంకలనం. ఇది జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో 2001లో వెలువడింది. దీని ప్రాధాన్యం కేవలం బీసీ జీవితాలను సాహిత్యంలోకి తీసుకురావడంలో లేదు. ఆ జీవితాలు కవిత్వంగా మారినప్పుడు ఏమి మారింది-- అనుభవం మాత్రమేనా? భాష, రూపం, ప్రతీక, దేహ బోధ, శబ్దం, కవితా స్వరం కూడా మారాయా? అనే ప్రశ్నను ముందుకు తీసుకురావడంలో ఉంది.

సాహిత్యం గుర్తించే అనుభవాల పరిధిని, వాటిని వ్యక్తీకరించే భాషా--రూపాల పరిధిని, వాటిని విలువైనవిగా భావించే ప్రమాణాల పరిధిని విస్తరించడాన్ని ప్రత్యామ్నాయ సౌందర్య శాస్త్ర ప్రతిపాదనకు మూలంగా భావిస్తే-- అలాంటి ప్రతిపాదన ఈ 'వెంటాడే కలాలు -- వెనుకబడిన కులాలు' సంకలనంలో జరిగిందని గమనిస్తాం. కవితలోకి వచ్చిన అనుభవం భాషను మార్చితే, కొత్త ప్రతీకను నిర్మిస్తే, పాత రూపాన్ని పునర్నిర్మిస్తే, శబ్దానికి కొత్త అర్థం ఇస్తే, దేహాన్ని కొత్త దృష్టితో చూపిస్తే, మౌఖికతను సాహిత్య భాషగా నిలబెడితే, ఒక సాధారణ వస్తువును సామాజిక జ్ఞాపకంగా మార్చితే, అక్కడ సౌందర్య విస్తరణకు అవకాశం ఏర్పడుతుంది. ఈ విస్తరణ ఈ సంకలనంలో మూడు స్థాయిల్లో జరుగుతుంది. మొదటిది వస్తు విస్తరణ-- ఇంతవరకు అంచున ఉన్న వృత్తులు, శ్రమలు, జీవన అనుభవాలు కవితా వస్తువులుగా ప్రవేశించాయి. రెండోది రూపాత్మక విస్తరణ-- ఆ అనుభవాలు పాత కవితా రూపాల్లో మాత్రమే కాకుండా సంభాషణ, పత్రరూపం, మౌఖిక పలుకు, వస్తు ప్రతీక, శబ్ద నిర్మాణం వంటి భిన్న పద్ధతుల్లో వ్యక్తమయ్యాయి. మూడోది ప్రమాణాత్మక విస్తరణ-- ఒకప్పుడు సాహిత్యానికి తక్కువగా పరిగణించబడిన భాష, దేహం, వస్తువు, శబ్దం, అనుభవం కూడా సౌందర్యాన్ని నిర్మించగలవని నిరూపించాయి.

ఈ సంకలనంలో ఇరవై మూడు మంది బీసీ కవులు, కవయిత్రులు అట్టడుగు కులాల శ్రమైక జీవన సంస్కృతిని, వారి ఆత్మకథనాత్మక అనుభవాలను కొత్త కవితా వస్తువులుగా స్వీకరించారు. అంబటి వెంకన్న, అనిశెట్టి రజిత, బాణాల శ్రీనివాసరావు, బెల్లి యాదయ్య, జి. విజయలక్ష్మి, జూలూరు గౌరీశంకర్, నాళేశ్వరం శంకరం, ప్రసాదమూర్తి, సీతారాం వంటి కవులు తమ కలాల ద్వారా సరికొత్త జీవిత దృశ్యాలను పాఠకుల ముందుంచారు. స్వర్ణకార--కమ్మరుల కొలిమి సెగలు, గొర్రెల కాపరుల మందల పయనం, నాయీ బ్రాహ్మణుల నిత్య క్షవరం, చేనేత మగ్గాల సంక్షోభం, దేవదాసీ--కళావంతుల సామాజిక ఆర్తి వంటి విభిన్న కులవృత్తుల సంక్లిష్ట వాస్తవాలు ఇందులో ఆవిష్కృతమవుతాయి.

తెలుగు సాహిత్యంలో శ్రమ, పేదరికం, అసమానత, అట్టడుగు జీవితం మొదటిసారి బీసీ సాహిత్యం వల్లనే కనిపించాయని ఇక్కడ చెప్పటం లేదు. ఆ అనుభవాలకు తెలుగు సాహిత్యంలో ముందే స్థానం ఉంది. 'వెంటాడే కలాలు' ప్రత్యేకత బీసీ వృత్తి--జీవన అనుభవం తనదైన భాష, వస్తు ప్రపంచం, శారీరక అనుభవం, వృత్తి జ్ఞానం, కుటుంబస్మృతి, కుల సంబంధం వంటి అంశాలతో కవితా నిర్మాణాన్ని ఎలా ప్రభావితం చేసిందో చూడటంలో ఉంది. అనుభవం కొత్తది కావడం కంటే, ఆ అనుభవం కళాత్మకంగా ఎలా రూపాంతరం చెందిందన్నదే ఇక్కడ విమర్శ చేయవలసిన అంశం.

సీతారాం 'రెజ్యూమ్' కవిత అధికారిక బయోడేటా నమూనాను స్వీకరిస్తూ 'చిరునామా: అవమానం/ ఆత్మన్యూనత', 'కులం: మంగలి' వంటి వివరాలను పేరుస్తుంది. ఆ విధంగా అర్హత, గుర్తింపు అనే ఆధునిక భావనలను అది నిలదీస్తుంది. కాగితపు ధ్రువపత్రాలే అర్హతను నిర్ణయిస్తాయనే వ్యవస్థకు ఎదురుగా, కులవ్యవస్థ మిగిల్చిన గాయాల అనుభవ పత్రాన్నే పాఠకుల ముందుంచడం ఈ కవిత ప్రధానంగా చేసిన కళాత్మక పని. మరీ ముఖ్యంగా, 'రెజ్యూమ్' అనే అధికారిక పత్రరూపాన్ని కవితగా ఉపయోగించడం ద్వారా కవి విషయాన్ని మాత్రమే మార్చలేదు, రూపాన్నే మార్చాడు.

అనిశెట్టి రజిత రచించిన 'దొర్సానీ ఓ దొర్సానీ' కవితలో దేహబోధ మరో ముఖ్యమైన సౌందర్య విస్తరణగా కనిపిస్తుంది. సాధారణంగా దేహబోధ అంటే తన శరీరం పట్ల ఉండే అవగాహన. ఇక్కడ మాత్రం దేహబోధ అంటే శరీరంపై, శరీరంలో, శరీరం ద్వారా వ్యక్తమయ్యే జీవనానుభవాన్ని సౌందర్యానుభవంగా గుర్తించే దృష్టి. 'ఇన్నొద్దులు నువు కాలుకింద బెడితే/ నీ అరికాల్లకు నొప్పయితదని నా అరచేతుల్ని పర్సిన' అనే వ్యక్తీకరణలో అరచేతులు కేవలం శరీరంలోని ఒక భాగంగా కనిపించవు, అవి ఒక స్త్రీ జీవితంలో పేరుకున్న శ్రమ, బాధ, అవమానం, వర్గ--కుల దోపిడీ అనుభవాలకు గుర్తులుగా నిలుస్తాయి. శరీరంపై పడిన గాయాలు శరీరంలోనే మిగిలిపోకుండా కవితలో భావంగా మారతాయి. ఇక్కడ దేహం బయటి నుంచి చూసే అలంకార రూపం కాదు, లోపల నుంచి మాట్లాడే జీవితం. అందువల్ల ఇక్కడ సౌందర్యం దేహం బాహ్య ఆకృతిలో కాక, ఆ దేహం మోసిన అనుభవంలో, 'నా ఆత్మగవురం మర్లబడి / నెత్తురు బొట్టై రాలుతున్న నా కన్నీల్ల సాచ్చిగా' అన్న ఆత్మగౌరవ ప్రకటనలో కనిపిస్తుంది.

బాణాల శ్రీనివాసరావు రచించిన 'కుంపటి'లో రూపాంతరం మరో స్థాయిలో జరుగుతుంది. 'పనిముట్లు రకరకాల రాగాలు పలికేవి/ జాతికారు పాడే జావళీలతో/ పట్కారు చేసే పదనిసల లయల్తో/ పట్టెడ మొద్దు అందించే కాంగో మోతల్తో' అనే వ్యక్తీకరణలో పనిముట్టు ఒక శబ్దవస్తువు నుంచి సంగీతానుభవంగా మారుతుంది. కొలిమి పనిలో వినిపించే మోత, దెబ్బ, చలనం, పునరావృతం-- ఇవన్నీ కవి చెవిలో లయగా మారతాయి. సౌందర్యం మృదువైన వాద్యాల నాదంలోనే ఉంటుందని అనుకున్న సంప్రదాయ దృష్టి ఇక్కడ విస్తరిస్తుంది. కంసాలి, కమ్మరి పనిముట్ల శబ్దం కూడా కవితలో సంగీతంగా వినిపించగలదని 'కుంపటి' చూపిస్తుంది.

జూలూరు గౌరీశంకర్ రచించిన 'కొలిమి'లో "పెద్ద బాడిశ నా చేతి పొడిగింపేకాదు, తరతరాల నాగలికి, నాగరికతకు దీర్ఘకాలిక కొనసాగింపు" అనే భావనతో వస్తువు నుంచి ప్రతీకకు కవిత ప్రయాణం మొదలవుతుంది. బాడిశ చేతి పొడిగింపుగా, సృష్టి సాధనంగా, చరిత్రను మోసే ప్రతీకగా మారుతుంది. ఇక్కడ కళాత్మక ప్రక్రియ పనిముట్టు ప్రతీకీకరణ. శిల్పాన్ని చూసే చూపు నుంచి శిల్పాన్ని సృష్టించే సాధనాన్ని చూసే చూపుకు కవిత మారుతుంది.

బెల్లి యాదయ్య 'పాదాలు' కవిత శరీరంలోని అట్టడుగు భాగాన్ని కవితా కేంద్రంగా నిలబెడుతుంది. 'పాదాలు చాలా గొప్పవి' అనే మాటతో మొదలయ్యే ఆలోచన శరీర భాగాన్ని కేవలం నడవడానికి మాత్రమే ఉన్న అంగంగా చూడదు. నేలను తాకుతూ జీవనం సాగించే మనిషి సమస్త అనుభవాలకు అవి అసలైన వెన్నెముక. "మురికిని భరిస్తూ ముఖానికి పరిమళాలను జతచేస్తాయి/ పాచిని నాకుతూ నాలుకకు ఫలహారాన్ని అందిస్తాయి/...పాదాల నుంచి పుట్టినందుకు/ చరిత్రహీనున్ని కాదు నేను చరిత్రకారుణ్ని" అని కవి ప్రకటించడం ద్వారా సాహిత్యం ఇంతవరకు ఏ దేహాన్ని చూస్తూ వచ్చింది, ఏ భాగాన్ని తక్కువ చేసి వదిలేసింది అనే మౌలిక ప్రశ్న ముందుకు వస్తుంది.

మందరపు హైమవతి రచించిన 'జ్యూయలరీ షాపు' కవితలో జీవితం సంప్రదాయ సౌందర్యపు అలంకరణల ద్వారా కాక, శ్రామికుల విధ్వంస అనుభవాల ద్వారా కనిపిస్తుంది. "వందల చందమామలు/ ఒక్కసారే విరిసిన/ దీపాల వెలుగులో/ ధగధగ మెరిసే షాపు" అనే దృశ్యం కేవలం ఒక వైభవోపేత వాతావరణాన్ని చూపించదు, ఆ వెలుగు వెనుక "అప్పులు తీర్చలేక / ఆత్మహత్య చేసుకొన్న / మా అన్నయ్య శవచిత్రం" దాగి ఉందన్న భయానక నిజాన్ని గుర్తుచేస్తుంది. కవితలో వెలుగు ఒక అలంకార దృశ్యంగా నిలవకుండా, దోపిడీకి గురవుతున్న మనుషుల జీవితాలపై పడే చూపుగా మారుతుంది. ఈ కవితలో ప్రత్యామ్నాయ సౌందర్యం కొత్త అలంకరణలను చూపించడంలో లేదు, ఆడంబరాల వెనుక అణగిపోయిన కళాకారుల 'మట్టిగొట్టుకొన్న వేళ్ళు' మోసిన విషాదానికే కవితా విలువను ఇవ్వడంలో ఉంది.

జి. విజయలక్ష్మి రచించిన 'పొదిలో కత్తి' కవితలో ఒక పనిముట్టు పీడిత స్త్రీ ప్రతిఘటనకు, సాంస్కృతిక ధిక్కారానికి ప్రతీకగా మారుతుంది. 'పొదిలో కత్తి' అనే శీర్షికే ఒక అణగారిన కులవృత్తి ప్రపంచాన్ని మన ముందుకు తెస్తుంది. కత్తి ఇక్కడ కేవలం క్షవరం చేసే పనిముట్టు మాత్రమే కాదు, దొరల వెట్టిచాకిరీని, అవమానాలను, కామపు చూపులను ఎదురించి నిలబడే పోరాట సాధనం. "దొరగాడి దొడ్డిగుమ్మంకాడ/ నీల్ల తొట్టివయ్యావు నువ్వు" అంటూ భర్త దాస్యత్వాన్ని ప్రశ్నిస్తూనే, "పొదిలో కత్తికి మెత్తగా పదునెట్టు/ గడ్డాలు తడిపె గిన్నెలో అల్ల రగతం పిండు" అని కవిత గర్జిస్తుంది. శ్రమజీవి చేతిలోని వస్తువు తిరుగుబాటు ఆయుధంగా మారిపోతుంది. అందువల్ల ఇక్కడ ప్రత్యామ్నాయ సౌందర్యం పనిముట్టును వర్ణించడంలో లేదు, దాని వెనుక ఉన్న శ్రమను, బహుజన స్త్రీ రగిలించిన చైతన్యాన్ని కవితా ప్రతీకగా మలచడంలో ఉంది.

ఈ కవితలను సమగ్రంగా పరిశీలించినప్పుడు ప్రత్యామ్నాయ సౌందర్యం ఒకే మూసలో తయారవడం లేదని స్పష్టమవుతుంది. కాబట్టి 'బీసీ సాహిత్యం' అనే పదాన్ని కేవలం రచయిత కులపరిచయంతో నిర్వచించలేం.

అదే సమయంలో కుల నేపథ్యాన్ని పూర్తిగా తొలగించి "ఇది అందరి మానవ అనుభవమే" అని చెప్పడం కూడా సరిపోదు. కులం ఒక సామా జిక అనుభవ నిర్మాణం. వృత్తి, శ్రమ, భాష, కుటుంబం, అవమానం, ఆత్మగౌరవం వంటి వాటి మీద అది ప్రభావం చూపుతుంది. అయితే సాహిత్యపరంగా ముఖ్యమైనది ఆ అనుభవం రచనలో ఏ మార్పును తెచ్చిందన్నది. కవితా రూపం మారిందా? పదజాలం మారిందా? ప్రతీక చిత్రించిన విధానం మారిందా? స్వరం మారిందా? పాఠకుడి దృష్టి మారేలా ఏదైనా కళాత్మక చర్య జరిగిందా? ఈ ప్రశ్నల ద్వారానే బీసీ అనుభవం సాహిత్య నిర్మాణంలో ఎలా పనిచేసిందో గుర్తించవచ్చు.

ఎడిటర్ చైతన్య

## నేను చెప్పేవి అబద్ధాలైతే.. రాజకీయాల నుంచి వైదొలగుతా: మాధవరం కృష్ణారావు

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తన గురించి చేసిన ప్రస్తావనపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లలోని భూమి చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు కావట్లేదని మంత్రి తప్పుదోవ పట్టించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు. 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రానిస్తే.. 22ఏపై అన్ని ఆధారాలతో నిరూపిస్తానని, తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి వైదొలగుతానని కృష్ణారావు అన్నారు.

## ఏపీలో పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు

మొదటి పేజీ తరువాయి
అమరావతి: ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరో 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ఈనెల 22న ప్రకటించాలని పేర్కొన్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా రూపకల్పన చేయాలని సూచించారు.

మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి కావడంతో అక్కడ సెప్టెంబరు 3 నాటికే ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది. అలాగే, రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తయిన 58 చోట్ల కూడా సెప్టెంబరు 3నే జాబితాలను వెల్లడించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి కానున్నందున.. ఆయా చోట్ల ఓటర్ల జాబితా ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సెప్టెంబరు 13న ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ.. సెప్టెంబరు 22ను ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఓటర్ల జాబితాల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధం అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేయడానికి ప్రభుత్వానికి మరింత మార్గం సుగమం కానుంది. సంబంధిత కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదు: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి
అమరావతి: కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కోచింగ్ సెంటర్ల అంశంపై సీఎం సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే కోచింగ్ సెంటర్లపై చట్టపరంగా కొరడా ఝుళిపించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులను రాజకీయ ఆందోళనలకు వినియోగిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోచింగ్ సంస్థలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అభ్యర్థులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా.. పరీక్షలపైనే దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

### పాన్ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్‌లో యువత పాల్గొనాలి: సీఎం

స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత శక్తి, ఆలోచనలు, నైపుణ్యాలే కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. అక్టోబర్ 3న విజయవాడలో జరిగే పాన్ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్-2026లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్‌టెక్, స్పేస్‌టెక్, క్లీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, అధునాతన తయారీ రంగాలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఎదుగుతోందని వెల్లడించారు. యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు తమ ఆలోచనలు, అనుభవంతో ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## రష్యాపై ఆంక్షల బిల్లులో భారత్ పేరు..

మొదటి పేజీ తరువాయి



రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు అమెరికా సర్కార్ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కీలక బిల్లును ఈ వారం ప్రతినిధుల సభ ముందుకు తీసుకురానుంది. అయితే, ఈ బిల్లు లో భారత్ పేరును ప్రత్యక్షంగా చేర్చాలని డెమోక్రటిక్ పార్టీ చట్టసభ్యులు ప్రతిపాదించారు.

దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ ఇప్పటికే 86-11తో ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ బిల్లులో రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాల (=బంంఋఖఅ ుతీఋఎవ ్ఝుతీఅవతీం) పేర్లను నేరుగా ప్రస్తావించలేదు. కేవలం చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ఐదు అతిపెద్ద దేశాలంటూ పేర్కొన్నారు. దీన్ని సవరించాలని తాజాగా చట్టసభ్యులు ప్రతిపాదించారు.

100 శాతం టారిఫ్‌లు ఎదుర్కొనే దేశాల జాబితాలో భారత్‌తో పాటు చైనా, తుర్కియే, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా, యూఏఈ, సింగపూర్, కజకిస్థాన్, కిర్గిస్థాన్ పేర్లను చేర్చాలని డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు స్టేనీ హోయర్ ప్రతిపాదించారు. ప్రతినిధుల సభలో ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడి సంతకంతో ఇది చట్టరూపం దాల్చనుంది. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ బిల్లును ఆమోదింపచేసుకోవాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది. కాగా.. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విస్తృత సుంకాలను విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కల్పించే సెక్షన్ 113ను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ మరో డెమోక్రటిక్ నేత ప్రతిపాదించడం గమనార్హం.

ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టుల లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది.

## జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమే: నిర్మలా సీతారామన్

మొదటి పేజీ తరువాయి
జెన్‌జీ , జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత కూడా నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని.. వారు ముందుకు రావాలని కోరారు. దేశం మనకు ఏం చేసిందని ప్రశ్నించకుండా.. మనం దేశం కోసం ఏం చేశామని ప్రశ్నించుకోవాలని సూచించారు. తమిళనాడు లోని డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు.

'మిమ్మల్ని మీరు జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే.. మీరు చెప్పేది వినడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో మీ పాత్ర ఏమిటి?, మీరు దేశం కోసం ఏం సాధించవచ్చు? అనే విషయాల గురించి తప్పక ఆలోచించాలి. దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. పలు ప్రపంచ దేశాల్లో యుద్ధాలు, ఘర్షణల కారణంగా పౌరులు నిర్వాసితులుగా మారుతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. కానీ మనకు ఆ పరిస్థితి లేదు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం , పశ్చిమాసియాలో ఘర్షణలు వంటి అనిశ్చితుల వల్ల ప్రపంచ దేశాల్లో ముడి చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా ప్రభావితం అవుతోంది. అయినప్పటికీ భారత్ అన్ని పరిస్థితులను ఎదుర్కొని.. 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని బలమైన ప్రభుత్వమే ఈ స్థిరత్వానికి కారణం. యువత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్నది సాధించగలం' అని నిర్మలా సీతారామన్ విద్యార్థులకు సూచించారు.

## యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు..

మొదటి పేజీ తరువాయి
రూ.2000 వరకు ఉండే యూపీఐ లావాదేవీల పై బ్యాంకులు/పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ స్పందించింది. యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా..? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించడానికి కేంద్రం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందంటూ విమర్శించారు.

"దేశంలో రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీల సంఖ్య 5 శాతం మాత్రమే అయినప్పటికీ.. అవి మొత్తం విలువ పరంగా సుమారు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయి. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానంలో మార్పు చేసుకుంటోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడిన ప్రధాని మోదీ.. మరోసారి అమెరికా (ఖూూ) ఒత్తిడికి లొంగిపోతున్నారు. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం కారణంగా సామాన్యుడి జేబులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. టోకు ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలో ఉండగా.. 'డిజిటల్ చెల్లింపుల పన్ను' విధించడం ద్వారా ప్రజల మిగిలిన పొదుపును కూడా ప్రభుత్వం నాశనం చేయాలని ప్రణాళిక వేసింది. పదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ కొట్టింది. పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికే పెద్ద నోట్లు రద్దు చేశామని ప్రభుత్వం వాదించింది. రూ.5 వేల లావాదేవీలపై రూ. 25, రూ.10వేల లావాదేవీలపై రూ.50 వరకు పన్ను విధించే అవకాశం ఉందని నివేదికలు చెపుతున్నాయి.. ఇది నిజమేనా? ఎండీఆర్.. ద్వారా వ్యాపారులపై పడే అదనపు భారం చివరికి పెరిగిన ధరల రూపంలో సగటు వినియోగదారుడిపైనే పడుతుందని ప్రభుత్వం గ్రహించడం లేదా? ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ప్రతిరోజూ వారి జేబులు ఖాళీ చేయడానికి కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తోంది" అని కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) నేతలు దుయ్యబట్టారు.

## ఆ కుటుంబంలో ఐదుగురు తోబుట్టువులకు.. నీట్‌లో సీట్లు

మొదటి పేజీ తరువాయి
కడు పేదరికం, అరకొర వసతులు ఇబ్బంది పెట్టినా.. వాటిని దాటుకుని ప్రాణం పోసే వైద్య వృత్తి వైపు అడుగులు వేశారు. ఒకరి తర్వాత ఒకరు నీట్ లో ఉత్తీర్ణత సాధించి వైద్య విద్య లో ప్రవేశం పొందారు. ఓ నిరుపేద ఆదివాసీ రైతు కుటుంబంలో పుట్టిన ఐదుగురు అన్నాచెల్లెళ్ల కథ ఇది..!

ఒడిశా లోని కంధమాల్ జిల్లా సికాబడి గ్రామానికి చెందిన బృషినాయక్, అనుశాయ దంపతులది నిరుపేద కుటుంబం. ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తుంటారు. కొన్నిసార్లు కుటుంబాన్ని పోషించేందుకు బృషి నాయక్ వలసకూలీగా ఇతర రాష్ట్రాల్లో పనిచేశారు. అతడు చదువుకోలేదు, కానీ చదువు ఎంత ముఖ్యమో అర్థం చేసుకున్నారు. అందుకే, ఎంత కష్టమైనా సరే పిల్లలను చదివిస్తున్నారు.

అన్న స్ఫూర్తితో..

తండ్రి బృషినాయక్ కష్టం చూసిన కుమారుడు బిబీశన్ మంచిగా చదువుకుని నీట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కొరాపుట్‌లోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అతడు.. ప్రస్తుతం అక్కడే ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. బిబీశన్ స్ఫూర్తితో పెద్ద చెల్లెలు మోనాలిసా కూడా నీట్‌లో అర్హత సాధించి.. ఇదే మెడికల్ కాలేజీలో వైద్య విద్య రెండో సంవత్సరం చదువుతోంది. ఆ తర్వాత మరో ముగ్గురు చెల్లెల్లు సునేమీ, ఆశ్రియా, మీనాక్షి కూడా ఈ ఏడాది నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ప్రభుత్వ రంగ వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందారు.

ఇందులో మీనాక్షి.. బృషి తమ్ముడు జిశియా కుమార్తె. కానీ కొన్ని కారణాల రీత్యా చిన్నతనం నుంచి ఆమెను బృషి దంపతులే పెంచుతున్నారు. "వీళ్లంతా నా పిల్లలే. మా ఇంట్లో మొత్తం 9 మంది ఉంటాం. మరో ఇద్దరు కుమారులు స్కూల్లో చదువుతున్నారు. మా పిల్లలు ఏం కోర్సులు చేస్తున్నారో నాకు తెలియదు. కానీ, వారంతా జీవితాల్లో స్థిరపడి సమాజానికి ఎంతో కొంత మేలు చేస్తే అంతకంటే ఆనందం ఏముంటుంది" అని వీరి తల్లి అనుశాయ ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుల కోసం ఇప్పటికే కొంత రుణం తీసుకున్నామని, అయితే వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వం తమకు అండగా నిలవాలని బృషి నాయక్ కోరుతున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో నాకు గొడవల్లేవ్: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. కుల సర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం జరిగిందన్నారు. కుల సర్వేను కేంద్రం తొక్కి పెట్టడం దురదృష్టకరమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు."సీఎం రేవంత్‌రెడ్డితో నాకు ఎక్కడా గొడవ జరగలేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమే. మా మధ్య గ్యాప్ ఉందని, గొడవ జరిగిందని ప్రచారం జరుగుతోంది. అలాంటివి ఏమీ లేవు. సీఎంతో అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరి చేసుకున్నాం. పార్టీ విషయంలో సీఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. బీసీ మంత్రిని తొలగించినప్పుడు నేను కూడా బాధపడ్డా. ఏఐసీసీ నిర్ణయం మేరకే సురేఖపై చర్యలు తీసుకున్నాం. క్రమశిక్షణ తప్పితే ఎవరిపైన అయినా చర్యలు తప్పవు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఏఐసీసీ నిర్ణయించింది" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# వినియోగదారులతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి -- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస

హైదరాబాద్, సెప్టెంబర్ 15, జన తెలంగాణ
టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఠ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మార్గంలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొని వినియోగదారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రజాబాట కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం ప్రజలకు మరింత చేరువ కావడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం మరియు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టడమేనని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక మండపాలు, నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వ్యవస్థ నిర్వహణపై సమీక్ష నిర్వహించిన సీఎండీ గారు, “వాక్ అలోంగ్ ది లైన్” కార్యక్రమాన్ని మరింత



సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యుత్ ఆస్తుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించాలని సూచించారు. కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మార్గంలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో డీఈ (ఆపరేషన్స్) జనప్రియ కూకట్‌పల్లి, ఏడీఈ (ఆపరేషన్స్) ప్రసాద్,రాజు చైతన్య, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సీఎండీ సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని బాలాజీనగర్ ప్రాంతంలో ఉన్న ఐడీఎల్ చెరువు (బేబీ పాండ్) వినాయక నిమజ్జన కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ సదుపాయాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలకు అవసరమైన విద్యుత్ ఏర్పాట్లు పూర్తయ్యాయా లేదా అనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతరాయ సరఫరా అందించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈ కొండాపూర్ శ్యామ్‌కుమార్, ఏడీఈ కేపీహెచ్‌బీ మాణిక్యల్, ఏఈ బాలాజీనగర్ భీమలింగప్ప మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ●విద్యకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు
- ●నవంబర్ 19 నుంచి ‘రాజీవ్ యువ వికాసం’ తొలి విడత సాయం
- ●ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు
- ●ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై సమీక్ష సమావేశం
- ● సమీక్ష సమావేశానికి హాజరైన సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్ సెప్టెంబర్ 15 జన తెలంగాణ
రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమక్షానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని, సంక్షేమ శాఖల కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. నవంబర్ 19 నుంచి లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను



కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

## గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు

రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆధునిక వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ. 25 కోట్లను కేటాయించినట్లు గుర్తుచేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా? ప్రతిష్టాత్మక ఉద్యోగాలు సాధించారా? లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా? ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి “సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్” (జజుూూ) తో అధ్యయనం చేయించి డిటైల్డ్ రిపోర్టు తయారు చేయించాలని తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిళ్లపై చేసిన వ్యయం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య, వారికి అందించిన శిక్షణ, సాధించిన ఫలితాలపై ఆరా తీశారు. స్టడీ సర్కిళ్ల ద్వారా వస్తున్న ఫలితాలు, పెట్టుబడికి అనుగుణంగా వస్తున్న ప్రయోజనాలపై వివరణాత్మక అంచనా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన కోచింగ్ అందించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆయా కోర్సులను స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించేలా పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రెటరి విజయేంద్రబోయి, ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ సెక్రెటరి సంతోష్ , ఎస్సీ కార్పోరేషన్ వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా బీజేపీ భారీ ‘తిరంగా ర్యాలీ’..

- ●సెప్టెంబర్ 17ను అధికారికంగా ‘విమోచన దినోత్సవం’గా నిర్వహించాలి...
- ●బిజెపి జిల్లా అధ్యక్షుడు. సాయిని మల్లేశం

కరీంనగర్ సెప్టెంబర్ 15 జన తెలంగాణ
తెలంగాణ రాష్ట్ర బిజెపి పిలుపు మేరకు సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ‘తిరంగా బైక్ ర్యాలీ’ నిర్వహించారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో గీతాభవన్ నుండి ప్రారంభమైన ఈ తిరంగా ర్యాలీ... కమాన్ సర్కిల్, ధోభివాడ, ఎల్ఐసి ఆఫీస్, భగత్ సింగ్ విగ్రహం చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. యువకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున త్రివర్ణ పతాకాలు చేతబూని భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం బీజేపీ జిల్లా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం , నాయకులు నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## సెప్టెంబర్ 17 ‘ప్రజా పాలన దినోత్సవం’ దేనికి?.. విమోచన దినోత్సవమే అధికారికంగా జరపాలి: సాయిని మల్లేశం

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ‘ప్రజా పాలన దినోత్సవం’గా మార్చడాన్ని సాయిని మల్లేశం తప్పుపట్టారు.
నిరంకుశ రజాకార్ల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన చారిత్రక దినమైన సెప్టెంబర్ 17ను, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ‘తెలంగాణ విమోచన దినోత్సవంగా’ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారిక వేడుకల



నిర్వహణలో ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. విమోచన దినోత్సవం నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్న ఇబ్బంది ఏంటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రజాకర్ వారసుల పార్టీ కి భయపడి విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదా అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ విమోచన దినోత్సవం ను గుర్తించి ప్రతి ఏటా అధికారికంగా కార్యక్రమం నిర్వహిస్తుందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేని స్థితిలో ఎందుకు ఉందో తెలంగాణ ప్రజలకు, సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ , మేయర్ కోలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై సునీల్ రావు , బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు , సీనియర్ నాయకులు కన్నెబోయిన ఓదెలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనకొండ నాగేశ్వర్ రెడ్డి , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ కార్పొరేటర్ బోయిన పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష, ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా కార్యదర్శిలు చేపూరి సత్యం, సిహెచ్ నరసింహ రాజు , దండు కొమరన్న , వైద రామానుజం ,కార్పొరేటర్ లు మాసం గణేష్, తోట అనిల్ ఎన్నం ప్రకాష్, మునీందర్ , ఏపీపీ చంద్ర , శ్రీనివాస్ , నాంపల్లి శ్రీనివాస్, సోమిడి వేణు ప్రసాద్ , మీడియా కన్వీనర్ కట్కం లోకేష్ ,బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లు బొంతల కల్యాణ్ చంద్ర, ఊగిలే సుధాకర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి , ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు , వివిధ మోర్చల జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ ,ఆకుల రాజేందర్, మోతే గంగా రెడ్డి, శ్రీనివాస్ నాయక్ , మండల అధ్యక్షులుజాడి బాలరెడ్డి ,తణుకు సాయికృష్ణ, పాదం శివరాజ్, సంతోష్, కంది రాజిరెడ్డి ,చింతం శ్రీనివాస్, అవదుర్తి శ్రీనివాస్ , బత్తిని నరేష్ ,పేర్కా శ్రవణ్ ముత్యాల జగన్ రెడ్డి , శశికాంత్ యువ మోర్చ జిల్లా నాయకులు, బీజేపీ జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం --

## టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నర్సింహులు

హైదరాబాద్, అబిడ్స్
సెప్టెంబర్ 15, జన తెలంగాణ



టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నర్సింహులు గారు అబిడ్స్ సెక్షన్ పరిధిలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొని స్థానిక వినియోగదారులతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అబిడ్స్ సెక్షన్ పరిధిలో పాతవి, భద్రతాపరంగా ప్రమాదకరంగా మారిన ఎల్‌టీపీలర్ బాక్సుల స్థానంలో ఏర్పాటు చేస్తున్న నూతన ఎల్‌టీపీలర్ బాక్స్ పనులను పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, భద్రతా చర్యలు మరియు అమలు విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఆపరేషన్స్) మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణను దృష్టిలో ఉంచుకుని పాతబడిన, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ పరికరాలను దశలవారీగా ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా మారుస్తున్నామని తెలిపారు. ప్రజాబాట కార్యక్రమం ద్వారా విద్యుత్ శాఖ ప్రజలకు మరింత చేరువవుతుందని, వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి వేగవంతంగా పరిష్కరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ (మెట్రో జోన్) కర్ణాకర్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) సెంట్రల్ సర్కిల్ రమేష్, డీఈ సైఫాబాద్ గోపి, ఏడీఈ హైదర్‌గూడ రాజు, ఏఈ అబిడ్స్ వేదశ్రీతో పాటు సైఫాబాద్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేష్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ సెప్టెంబర్ 15 జన తెలంగాణ
హైదరాబాద్: వినాయక చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ బాలాపూర్ గణేష్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మాజీ మేయర్ పి. నరసింహారెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ కల్లం నిరంజన్ రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం, స్క్రీన్ టైమ్ నియంత్రణ ఎంతో కీలకం

కరీంనగర్ సెప్టెంబర్ 15 జన తెలంగాణ
ప్రస్తుత కాలంలో పిల్లల్లో ఊబకాయం, అధిక స్క్రీన్ టైమ్, రక్తహీనత, నోటి ఆరోగ్య సమస్యలు, శారీరక శ్రమలేమి, చదువులో మార్కులు--ర్యాంకుల కారణంగా ఒత్తిడి వంటి




సమస్యలు పెరుగుతున్నాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు, ప్రముఖ వైద్యులు డా. తిరుపతి రావు ఠ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్ రెడ్డి గారు స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ ఆధ్యా క్యాంపస్ లో నిర్వహించినటువంటి అవగాహన సదస్సుకు హాజరై వారందరూ మాట్లాడారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం రాకుండా చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలని సూచించారు. ప్యాకేజ్డ్ ఫుడ్స్, జంక్ ఫుడ్, అధిక చక్కెర కలిగిన పదార్థాలకు బదులుగా ఇంటివద్ద తయారు చేసే పోషకాహారాన్ని అందించడం ఎంతో మంచిదన్నారు. అధిక స్క్రీన్ టైమ్ పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, టీవీ వంటి స్క్రీన్‌ల వినియోగాన్ని తల్లిదండ్రులు నియంత్రించాలని చెప్పారు. పిల్లలను సాధ్యమైనంత వరకు స్క్రీన్‌కు దూరంగా ఉంచి, ఆటలు, పఠనం, సృజనాత్మక కార్యక్రమాలు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం వంటి అలవాట్లను ప్రోత్సహించాలన్నారు. పిల్లల్లో కనిపించే మరో ముఖ్యమైన సమస్య రక్తహీనత (అనీమియా) అని, దీనిని నిర్లక్ష్యం చేయకుండా పోషకాహారం, అవసరమైన వైద్య పరీక్షలు మరియు వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. సంవత్సరానికి కనీసం రెండుసార్లు దంత వైద్యుల పరీక్ష చేయించడం ద్వారా అనేక దంత సమస్యలను ముందుగానే నివారించవచ్చన్నారు. ప్రస్తుత జీవనశైలిలో పిల్లల్లో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఎక్కువసేపు కూర్చునే అలవాటు పెరుగుతోందని, దీనిని నివారించేందుకు ప్రతిరోజూ తగినంత శారీరక కార్యకలాపాలు, ఆటలు, వ్యాయామం ఉండేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వారు సూచించారు. అలాగే మార్కులు, ర్యాంకులు, పరీక్షల్లో విజయం సాధించాలనే ఒత్తిడి కొంతమంది పిల్లల్లో మానసిక ఒత్తిడికి దారితీస్తోందన్నారు. పిల్లలపై అధిక అంచనాలు పెట్టకుండా, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 16,2026

# ఆకలిగా ఉన్నప్పుడు కడుపులో పేగులు ఎందుకు అరుస్తాయో తెలుసా?

ఆ శబ్దాలు మాత్రం ఆకలివల్లే కాదు..!

## 1 ఇది సాధారణమే...

ఆకలిగా ఉన్నప్పుడు కడుపులో పేగులు అరవడం చాలామందికి సాధారణమే. అయితే ఈ శబ్దాలకు ఆకలి ఒక్కటే కారణం కాదు. జీర్ణవ్యవస్థలో జరిగే సహజ కదలికల వల్ల కూడా ఇలాంటి శబ్దాలు వస్తుంటాయి.

## 2 ఎలా వస్తాయి?

మనం ఆహారం తీసుకోని సమయంలో కూడా కడుపు, పేగులు తమ పనిని ఆపవు. పేగులు సంకోచించడం, వాటిలోని గాలి, ద్రవాలు ముందుకు కదలడం వంటి ప్రక్రియల సమయంలో శబ్దాలు ఏర్పడతాయి. వైద్య పరిభాషలో వీటిని బోర్బోరిగ్మీ అంటారు.



## 3 ఆకలిగా ఉన్నప్పుడు ఎందుకు ఎక్కువగా?

జీర్ణవ్యవస్థ భోజనం చేసిన తర్వాతే పనిచేస్తుందనుకోవడం పొరపాటు. తిన్న ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు, భోజనాల మధ్యలోనూ కదలికలు కొనసాగుతూనే ఉంటాయి.

## 4 మైగ్రేటింగ్ మోటార్ కాంప్లెక్స్

కడుపు ఖాళీగా ఉన్న సమయాల్లో జీర్ణవ్యవస్థలో ఒక ప్రత్యేకమైన కదలికల విధానం కొనసాగుతుంది. దీనినే మైగ్రేటింగ్ మోటార్ కాంప్లెక్స్ (ఎమ్ఎమ్‌సి) అంటారు. ఇది కడుపు, పేగుల్లోని మిగిలిన పదార్థాలు, ద్రవాలు, వాయువులను ముందుకు కదలించడంలో భాగంగా పనిచేస్తుంది.

## 5. ఎప్పుడు డాక్టర్ ని కలవాలి?

శబ్దాలు తరచూ, చాలా ఎక్కువగా వినిపిస్తే.
నొప్పి, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు ఉంటే.
ఆహారం తీసుకున్న తర్వాత కూడా శబ్దాలు తగ్గకపోతే.
బరువు తగ్గడం, రక్తస్రావం వంటి సమస్యలు కనిపిస్తే.

ఇలాంటి సందర్భాల్లో వైద్యులను

## 6. మొత్తం అర్థం ఏమిటి

కడుపు, పేగుల శబ్దాలు చాలా వరకు సాధారణమే. ఇవి జీర్ణక్రియలో భాగమైన సహజ ప్రక్రియ. కానీ తరచూ, ఎక్కువగా వినిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

**సారాంశం:** కడుపు శబ్దాలు భయపడాల్సిన విషయం కాదు.. అవి సాధారణమే! కానీ లక్షణాలు ఎక్కువైతే, వైద్య సలహా తప్పనిసరి.

మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే...

# స్క్వాట్స్ చేస్తున్నప్పుడు ఈ 7 తప్పులు చేయకండి..




వ్యాయామంలో స్క్వాట్స్‌ను చేయడం వల్ల చాలా ప్రయోజనాలుంటాయి. ఇవి కాళ్ల కండరాలు బలపరచడంతో పాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తాయి. తోడ, తుంటి కండరాలను బలోపేతం చేయడంలోనూ స్క్వాట్స్ సహాయపడతాయి. వీటిని తరచూ చేయడం వల్ల కొవ్వు కూడా తగ్గుతుంది. అయితే చాలా మంది స్క్వాట్స్‌లో కొన్ని తప్పులు చేస్తుంటారు. అలాంటి వారు ఆశించిన మేర ఫలితాలు పొందలేరు. స్క్వాట్స్ ద్వారా అధిక ప్రయోజనాలు కావాలనుకుంటే ఈ కింది తప్పులను చేయకండి.

1. మరీ ఎక్కువ బరువులను ఎత్తవద్దు: స్క్వాట్స్ చేస్తున్న సమయంలో ఎక్కువ బరువులను ఎత్తకండి. అధిక బరువు కారణంగా మోకాళ్లపై భారం పడుతుంది. అలాగే బరువు కారణంగా సరైన భంగిమను కొనసాగించడమూ కష్టమవుతుంది. అందుకే మొదట నియంత్రించగలిగే బరువుతోనే వ్యాయామం ప్రారంభించాలి. ఆ తరువాత క్రమంగా బరువును పెంచాలి.

2. నీ-వాల్గస్‌ను నివారించండి: కొందరు వ్యాయామ సమయంలో మోకాళ్లను వంచినప్పుడు ఒకదానికొకటి తగులుతుంది. దీన్నే నీ-వాల్గస్ అని వ్యవహరిస్తారు. ఇలా మోకాళ్లను వంచడం వల్ల వ్యాయామ ప్రయోజనాలు తగ్గిపోతాయి. తొడలు, తుంటి భాగాలు బలహీనంగా ఉండడం వల్ల నీ-వాల్గస్ వస్తుంది. దీన్ని అధిగమించాలంటే కాలి వేళ్లు ఉన్న దిశలోనే మోకాళ్లను కదిలించాల్సి ఉంటుంది.

3. మడమలను పైకి ఎత్తడం: స్క్వాట్స్ చేస్తున్నప్పుడు మడమలను నిలకడగా ఉంచాలి. వాటిని పైకి ఎత్తితే.. శరీరంలో బ్యాలెన్స్ కోల్పోతుంది. చీలమండ కదలికలు పరిమితంగా ఉండడం వల్ల ఈ సమస్య తలెత్తవచ్చు. దీన్ని నివారించడానికి మడమలను నేలపై గట్టిగా ఆనించి ఉంచాలి. అలాగే బరువును వేళ్లపై సమానంగా ఉండేలా చూసుకోవాలి.

4. నడుమును అధికంగా వంచడం: వ్యాయామ సమయంలో నడుము భాగాన్ని అధికంగా వంచడాన్ని 'బట్ వింక్' అని పిలుస్తారు. ఇలా అతిగా వంచితే బరువు మోస్తున్నప్పుడు భంగిమను కొనసాగించలేం. శరీరంపై నియంత్రణ లేనప్పుడు, ఎక్కువ బరువు మోస్తున్నప్పుడు 'బట్ వింక్' సమస్య వస్తుంది. ఇది రాకుండా ఉండాలంటే వ్యాయామంలో వెన్నెముకను నిటారుగా ఉంచాలి. శరీర సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్క్వాట్స్ చేయాలి.

5. ఒకేసారి కిందకు రావడం: స్క్వాట్స్ భంగిమలో కొందరు వేగంగా, ఒకేసారి కిందకు రావడం, ఒకేసారి పైకి వెళ్లడం చేస్తుంటారు. ఇలా చేస్తే కండరాలపై ఒత్తిడి పడుతుంది. అవి శరీర కదలికలను అర్థం చేసుకోలేవు. అందుకే స్థిరమైన వేగంతో కిందకి రావాలి. అలానే నియంత్రణతో పైకి లేవాలి.

6. షాల్లో స్క్వాట్స్‌కే పరిమితం కావద్దు: మోకాళ్లను పూర్తిగా కిందకు దించకుండా చేసే స్క్వాట్స్‌ను షాల్లో స్క్వాట్స్ అంటారు. వీటి వల్ల ప్రయోజనాలున్నప్పటికీ కండరాల అభివృద్ధికి ఇవి అంతగా దోహదపడవు. అందుకే పూర్తి స్క్వాట్స్ చేయడమే మంచిది.

7. వార్మ్-అప్, రికవరీలను నిర్లక్ష్యం చేయొద్దు: వ్యాయామంలో వార్మ్-అప్, రికవరీలు ముఖ్యమైనవని గుర్తించాలి. కోల్డ్ మసిల్స్‌ను స్క్వాట్స్ కోసం సిద్ధం చేయడంలో సరైన వార్మ్-అప్ ఉపయోగపడుతుంది. దీని వల్ల శరీరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వ్యాయామం తరువాత అలిసిపోయిన కండరాలకు రికవరీ అవసరం. లేదంటే ఆ కండరాలు బలహీనమవుతాయి.

# రూ.2000 వరకు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలుండవ్..!

మరి ఎక్కువ పేమెంట్ చేస్తే..!




- రూ.2000 వరకు ఉన్న యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయవద్దు.
- రూ.2 వేల కంటే ఎక్కువ లావాదేవీలపై భవిష్యత్తులో ఛార్జీలు ఉండొచ్చు.
- ఎలక్ట్రానిక్ రూపే డెబిట్ కార్డు చెల్లింపులపైకూడా ఇదే నిబంధన.
- MDR ఛార్జీలు, ఇంటర్‌చేంజ్ ఫీజు, నెట్‌వర్క్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు వంటి అంశాలు.

చిన్న కొనుగోళ్లకు ఎలాంటి భారం లేదు!

- పెద్ద చెల్లింపులపై
- భవిష్యత్తులో ఛార్జీలు వసూలు చేసే అవకాశం.

# ప్రయాణీకులకు ఎయిరిండియా గుడ్‌న్యూస్..!

ఇకపై 4 గంటల్లోనే రిఫండ్!




AIR INDIA

- రిఫండ్ సమయం: 14 రోజుల నుంచి 4 గంటలకు తగ్గింపు.
- టికెట్లపై పేర్ల సవరణ: 3 రోజుల నుంచి 30 నిమిషాలకు.
- ఒకే ఈ-మెయిల్‌లో పలుసమస్యలకు సమాధానం.



**ముంబైలో జోడ్డు మీటింగ్..**

టాటా గ్రూప్ వేతనం, తదితర అంశాలపై చర్చ.

**హోంమంత్రిత్వ శాఖ నోటీసులు..**

ఇమిగ్రేషన్ తనిఖీలపై వివరణకు ఆదేశం.

ప్రయాణికులకు వేగవంతమైన సేవలు లక్ష్యం!

# రానున్న ఐదేళ్లలో అత్యంత ప్రమాదకారిగా ఏఐ: గూగుల్ మాజీ పరిశోధకుడు






- ఏఐ మరింత మెరుగవుతోందని హెచ్చరిక.
- మానవాళికి ముప్పు కలిగించే అవకాశం ఉందని డాదియా ఆమోరదే హెచ్చరిక.
- గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు బిలాల్ చుగ్తాయ్ రాజీనామా.
- స్వతంత్ర పరిశోధన సంస్థలు అవసరం.
- ఏఐ ప్రమాదాలపై సమన్వయంతో పని చేయాలని సూచన.

ఏఐ అభివృద్ధిపై జాగ్రత్త అవసరం!

# బంగారం కోనేముందు ఈ మూడూ చూస్తున్నారా?

హాల్‌మార్క్‌తో 3 ముఖ్యమైన అంశాలు




1. BIS స్టాండర్డ్ మార్క్ — ఆభరణం ప్రమాణికమైనదని ధ్రువీకరిస్తుంది.
2. స్వచ్ఛత గ్రేడ్ (క్యారెట్లు) — 22K 916 — 14k, 18k, 20k, 22k, 23k, 24k గుర్తులతో స్వచ్ఛత తెలుసుకోవచ్చు.
3. HUID నంబర్ — HUID XXXXXX — 6 అంకెల కోడ్ ద్వారా నగ వివరాలు తెలుసుకోవచ్చు.

BIS Care యాప్‌తో సులభంగా తనిఖీ చేసుకోండి.

నిజమైన బంగారం కోసం హాల్‌మార్క్‌నే నమ్మండి!

# ఒకే రైలులో 250 ట్రక్కుల లోడ్.. భారత్‌కే సాధ్యమైన ఫీట్!

సరకు రవాణాలో భారతీయ రైల్వే అరుదైన రికార్డు సృష్టించింది. ప్రపంచంలో మరే దేశానికీ సాధ్యం కాని మొదటి పూర్తి ఎలక్ట్రిఫైడ్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ను ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో డబుల్ స్టాక్ రైళ్లు ఎప్పటినుంచో నడుస్తున్నా.. అవి డీజిల్ ఇంజిన్లతోనే నడుస్తున్నాయి. కానీ, విద్యుత్

**ఏమిటీ కారిడార్**

సరకు రవాణాను వేగవంతం చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను 2006లో ఏర్పాటు చేసింది. ఇందులో తూర్పు డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. దీని పొడవు 1337 కిలోమీటర్లు. 1506 కిలోమీటర్ల వెస్టర్న్ డెడికేటెడ్ కారిడార్‌లోని 326 కిలోమీటర్ల పొడవైన చివరి మూడు సెక్షన్లను ప్రధాని మోదీ ఇటీవల జాతికి అంకితం చేయడంతో డబ్ల్యూడీఎఫ్‌సీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. మొత్తం సరకు రవాణా మార్గం 2,843 కిలోమీటర్లకు చేరింది.

**ఏంటి ప్రయోజనం**

వెస్టర్న్ కారిడార్ ప్రపంచంలోనే మొదటి పూర్తి ఎలక్ట్రిఫైడ్ ఫ్రైట్ నడవా. ఇందులో డబుల్-స్టాక్ కంటైనర్ ట్రైన్లు నడుస్తాయి. ఎత్తైన ఓవర్‌హెడ్ వైర్లు (సుమారు 7.45 మీటర్లు) ఉండడం వల్ల రెండు కంటైనర్లను ఒకదాని పైన ఒకటి పెట్టి రవాణా



# ‘మండాడి’ రూ.65 కోట్ల కలెక్షన్స్.. జాక్‌పాట్ కొట్టిన నిర్మాత!




ప్రస్తుతం మూవీ బిజినెస్‌లో ఓటీటీ భాగమైపోయింది. బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయినా, ఓటీటీ ద్వారా వచ్చే ఆదాయంతో చాలా సినిమాలు గటెక్కాయి. ముఖ్యంగా ఈ మార్కెట్‌లో విపరీతమైన పోటీ ఉండటంతో నిర్మాతలు అడిగినంత ఇచ్చి సినిమాలను దక్కించుకునేవి ఓటీటీ సంస్థలు. ఒకప్పుడు సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా విడుదలకు ముందే డీల్ చేసుకునేవి. ఇప్పుడు వాటి వ్యాపార పంథాను మార్చుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద సినిమాకు వచ్చే స్పందనను బట్టి డబ్బులు చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇలాంటి డీలే ‘మండాడి’ విషయంలో జరగ్గా, అది నిర్మాత పాలిట వరమైంది.సుహాస్, సూరి కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం ‘మండాడి’. స్పోర్ట్స్‌యాక్షన్ డ్రామాగా దర్శకుడు మతిమారన్ పుగళేంది దీనిని తీర్చిదిద్దారు. తమిళ, తెలుగు భాషల్లో విడుదలైన ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకుంది. కేవలం ఐదు రోజుల్లో ఈ మూవీ రూ.65 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. ముఖ్యంగా కథా నేపథ్యం కొత్తగా ఉండటం, బోట్ రేసింగ్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. ఈ మూవీ విడుదలకు ముందు చేసుకున్న డీల్ కారణంగా చిత్ర నిర్మాత ఎల్రెడ్ కుమార్ ‘తంతే బూరెల బుట్టలో’ పడ్డారు‘మండాడి’ స్ట్రీమింగ్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. దీని వెనుక మూవీ కలెక్షన్స్ ఆధారిత ఒప్పందం జరిగిందట. ఈ సినిమా బడ్జెట్ సుమారు రూ.45 కోట్ల వరకూ అయినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ డీల్‌కు కూర్చోగా, నిర్మాత రూ.25 కోట్లు చెప్పారు. అందుకు నెట్‌ఫ్లిక్స్ ఒప్పుకోలేదు. రూ.15 కోట్లు ఇస్తామని చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య ఒక డీల్ జరిగింది. అదేంటంటే.. ఈ సినిమా రూ.50 కోట్లు (గ్రాస్) దాటితే ఓటీటీ సంస్థ రూ.30 కోట్లు చెల్లించాలి. అలాగే రూ.60-80 కోట్లు వసూలు చేస్తే రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారట. ఇప్పుడీ మూవీ రూ.65 కోట్లు (గ్రాస్) సాధించినట్లు చిత్ర బృందమే స్వయంగా ప్రకటించింది. ఇదే జోరు కొనసాగితే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరడం పెద్ద కష్టమేమీ కాదు. పెట్టిన బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం ఓటీటీ హక్కులను విక్రయించడం ద్వారా వస్తుండటంతో నిర్మాత జాక్‌పాట్ కొట్టినట్లు అయింది.

# ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రష్మిక.. అధికారిక ప్రకటన





ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకురాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన విడుదలైంది. ఇందులో సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక నటించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ‘ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ’ పేరుతో ఈ బయోపిక్ రూపొందనుంది.సుబ్బులక్ష్మి 116వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 16న ఈ బయోపిక్‌ను ప్రారంభించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. చెన్నై వేదికగా గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అగ్రకథానాయకుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఇక ఈ ప్రతిష్ఠాత్మక సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందించనున్నారు. ఈ బయోపిక్‌లో మొదట సాయిపల్లవి, రుక్మిణీ వసంత్, కీర్తిసురేశ్ పేర్లు వినిపించాయి. చివరికి రష్మికను ఫైనల్ చేశారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్ర కోసం రష్మిక.. ఇప్పటికే లుక్ టెస్ట్ కూడా చేయించుకున్నారు.




# స్టార్ హీరోలున్నా దక్కని ఆదరణ.. కలెక్షన్లలో వెనుకబడ్డ ‘హైవాన్’

బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ ‘హైవాన్’ . ప్రియదర్శన్ దర్శకత్వం వహించారు. సెప్టెంబరు 11న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన వసూళ్లు రాబట్టలేకపోయింది. ‘హనుమాన్ అంశ్’, ‘మీర్జాపూర్: ది మూవీ’ చిత్రాల ముందు నిలబడలేకపోయింది.ట్రేడ్ నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. ‘హైవాన్’ దేశీయంగా మూడురోజుల్లో కేవలం రూ.7.35 కోట్ల నెట్ వసూళ్లను మాత్రమే రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా వసూళ్లు రూ.11.55 కోట్లుగా నమోదయ్యాయి. ఆదివారం నాటికి మరో 1400 స్క్రీన్లు కోల్పోవడంతో వసూళ్లు 26 శాతం పడిపోయాయి. కేవలం రూ.1.85 కోట్లు మాత్రమే వచ్చాయి. అదే రోజు విశాల్ చతుర్వేది ‘హనుమాన్ అంశ్’కు రూ.22.50 కోట్లు రాబట్టడం గమనార్హం. ఆరో వీకెండ్‌లో ‘హనుమాన్ అంశ్’ రూ.51 కోట్లు వసూలు చేయగా.. ‘మీర్జాపూర్’ రెండో వీకెండ్‌లో రూ.36.25 కోట్లు రాబట్టింది. వీటితో పోలిస్తే ‘హైవాన్’ వసూళ్లు చాలా తక్కువ. ప్రియదర్శన్-అక్షయ్ కాంబోలో ఇది ఏడో చిత్రం. దాదాపు 18 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటించారు. ఈ ఏడాది ఆరంభంలో వీరి ‘భూత్ బంగ్లా’ బ్లాక్ బస్టర్ హిట్టయింది. గతంలో వచ్చిన ‘తషాన్’ (2008) తొలి మూడు రోజుల్లో రూ.11 కోట్లు వసూలు చేసింది. ‘హైవాన్’ ఆ మార్క్‌ను కూడా దాటలేకపోయింది. మలయాళ సూపర్ హిట్ ‘ఒప్పం’కి రీమేక్‌గా ఈ సినిమాని రూపొందించారు. ఇందులో మలయాళ స్టార్ మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర పోషించారు. శ్రియా పిల్‌గావ్కర్, సయామీ ఖేర్, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటించారు. మరోవైపు సెప్టెంబర్ 18న కరీనా కపూర్ నటించిన ‘దాయారా’, కునాల్ ఖేము ‘వైబ్’ చిత్రాలు విడుదల కానున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద ‘హైవాన్’కి పోటీ తప్పదు.

# అజిత్‌కు రేస్ కారు బొమ్మ గిఫ్ట్ ఇచ్చిన విజయ్.. ఆయనేం ఇచ్చారంటే..!





లండన్‌లోని ‘సిల్వర్‌స్టోన్ సర్క్యూట్’లో జరిగిన ‘మిచెలిన్ లే మాన్స్ కప్’ కార్ రేస్ సందర్భంగా సీఎం విజయ్, అగ్రకథానాయకుడు అజిత్ కలుసుకున్న విషయం తెలిసిందే. ఈ రేస్ అనంతరం ఒకరికొకరు ప్రత్యేకంగా కానుకలు ఇచ్చిపుచ్చుకున్నారు. రేసింగ్‌లో పాల్గొన్న అజిత్‌కు మద్దతుగా విజయ్ అక్కడకు వెళ్లి ఆయనను ఉత్సాహపరిచారు.సడెన్‌గా ఫ్రేమ్‌లోకి వచ్చిన త్రిష.. ముఖం తిప్పేసుకున్న విజయ్.. వీడియో వైరల్ అనంతరం అజిత్‌కు ఒక చిన్న రేసు కారు బొమ్మని విజయ్ బహుమతిగా అందించగా.. దానికి బదులుగా ఆయన సీఎంకు ఓ హెల్మెట్‌ను అందజేశారు. ‘నా ప్రియమైన సోదరుడు అజిత్‌కు ప్రేమతో..’ అని విజయ్ తన ఆటోగ్రాఫ్‌తో గిఫ్ట్ ఇవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. తమిళ చిత్రసీమలో వీరిద్దరి అభిమానుల మధ్య ఎప్పుడూ పోటీ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఎన్నో రోజులుగా వస్తోన్న విభేదాల వార్తలకు చెక్ పెట్టారు. ఇక నటి త్రిష, రాధికా శరత్‌కుమార్ కూడా లండన్‌లో అజిత్‌ను కలిసి అభినందించారు.

# హారర్ థ్రిల్లర్ ఆగింది.. సస్పెన్స్ థ్రిల్లర్ వస్తోంది..








ట్రైలర్‌తోనే ఆసక్తిని పెంచిన హారర్ థ్రిల్లర్ ‘418’. కీర్తన్ గౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషించారు. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం, తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తుండటంతో ఆసక్తి నెలకొంది. సెప్టెంబరు 18న విడుదల కావాల్సిన ఈ మూవీ ఇప్పుడు వాయిదా పడింది. ఈ మూవీని వివిధ భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నామని, అందుకే ప్రస్తుతానికి ‘418’ను వాయిదా వేస్తున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది.

### థ్రిల్ పంచేలా ‘ఇమ్మోర్టల్’..

సంగీత దర్శకుడిగా వరుస సినిమాలు చేస్తున్న జీవీ ప్రకాశ్ కుమార్ నటుడిగానూ అలరిస్తున్నారు. ఇటీవల తమిళంలో ఆయన నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ‘ఇమ్మోర్టల్’ ‘నాకు మరణం లేదు’ అనేది ఉపశీర్షిక. కయాదు లోహర్ కథానాయిక. మారియప్పన్ చిన్నా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ 19న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తమిళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. సాంకేతికంగా సినిమా మరో స్థాయిలో ఉందని ముఖ్యంగా వీఎఫ్ఎక్స్, జీవీ ప్రకాశ్ కుమార్ నటనను ప్రేక్షకులు మెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నట్లు వినాయకచవితి సందర్భంగా చిత్ర బృందం తెలిపింది. అంతేకాదు, ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. ఓ వైవిధ్యమైన కథతో థ్రిల్, రొమాంటిక్ ఎలిమెంట్స్‌ను మిళితం చేసి సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# ఎమ్మీ అవార్డుల్లో చరిత్ర సృష్టించిన ‘విడోస్ బే’.. 14 పురస్కారాలతో రి




78వ ప్రైమ్ టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకల్లో ‘విడోస్ బే’ వెబ్ సిరీస్ సత్తా చాటింది. కామెడీ-హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్.. ఏకంగా 14 అవార్డులను కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది.లాస్ ఏంజెలెస్‌లోని పీకాక్ థియేటర్‌లో సోమవారం జరిగిన ఎమ్మీ అవార్డుల ప్రదానోత్సవం లో ఈ సిరీస్ హవా కొనసాగింది. మొత్తం 19 విభాగాల్లో నామినేట్ కాగా.. 14 పురస్కారాలను తన ఖాతాలో వేసుకుంది. ఒకే సీజన్‌లో ఇన్ని అవార్డులు గెలుచుకున్న తొలి కామెడీ సిరీస్‌గా ఇది రికార్డులకెక్కింది. ‘ఉత్తమ కామెడీ సిరీస్’ అవార్డుతో పాటు మ్యాథ్యూ రైస్, కేట్ ఓఫ్లిన్, స్టీఫెన్ రూట్, బెట్టీ గిల్పిన్‌లకు నటన విభాగాల్లో అవార్డులు దక్కాయి. అలాగే ఉత్తమ రచన, దర్శకత్వం విభాగాల్లోనూ ఇది తన సత్తా చాటింది.

### కథేంటంటే..?

ఒక మారుమూల దీవిలో ఉండే తీరప్రాంత పట్టణం చుట్టూ ఈ కథ సాగుతుంది. ఆ ఊరి మేయర్ టామ్ లోఫ్టిస్ (మ్యాథ్యూ రైస్).. ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చాలనుకుంటాడు. ఈ క్రమంలో ఆ ఊరికి ఒక శాపం ఉందని తెలుసుకుంటాడు. ఊరి చరిత్రలో భాగంగా ఆ శాపాన్ని అంగీకరించడానికి బదులు, దాన్ని పూర్తిగా తొలగించాలని నిర్ణయించుకుంటాడు. దాన్ని వదిలించుకునేందుకు ఆ ఊరి ఏర్పాటుకు కారణమైన వ్యక్తి వంశంలో బతికున్న ఏకైక వారసురాలిని అంతం చేయాలనుకుంటాడు. 84 ఏళ్ల రుత్ అనే వృద్ధురాలిని ఆ వారసురాలిగా స్థానికులు భావిస్తుంటారు. ఆ తర్వాత, మేయర్ ఏం చేశాడు? కథ ఎలాంటి మలుపులు తిరిగిందన్నది సిరీస్‌లో చూడాల్సిందే.మ్యాథ్యూ రైస్, కేట్ ఓఫ్లిన్, స్టీఫెన్ రూట్ తదితరుల అద్భుత నటన, విభిన్నమైన కథాంశంతో సాగే ఈ సిరీస్‌ను ‘యాపిల్ టీవీ ప్లస్’ ఓటీటీలో చూడొచ్చు. అలాగే ‘అమెజాన్ ప్రైమ్ వీడియో’లోనూ అందుబాటులో ఉంది. కాగా, గత జూన్‌లోనే ఈ సిరీస్‌కి సంబంధించి రెండో సీజన్‌ను కూడా ప్రకటించారు.

# అత్యంత ఘనంగా "మిస్సింగ్ మేఘన" చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ - సెప్టెంబర్ 18న థియేటర్స్ లో విడుదల

జన తెలంగాణ సినిమా

ఫస్ట్ కాపి మూవీస్, కేడిడకో బ్యానర్ పై పంచుమర్తి నరేష్ బాబు ప్రొడ్యూసర్ గా, వాచస్పతి దర్శకత్వంలో రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులు ముందుకు వస్తున్న చిత్రం మిస్సింగ్ మేఘన. ఇటీవల ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ సెన్సేషనల్ డైరెక్టర్ వి. వి. వినాయక్ గారు, ఫస్ట్ సింగిల్ ప్రొడ్యూసర్ సురేష్ బాబు గారి చేతుల మీదుగా జరిగింది. శామ్. కె. నాయుడు సినిమాటోగ్రాఫర్ గా పనిచేసిన ఈ చిత్రానికి ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందించారు. సెప్టెంబర్ 18న థియేటర్స్ లో విడుదల కానున్న సందర్భంగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దామోదర్ ప్రసాద్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా తంత్ర చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి మాట్లాడుతూ... "నా స్నేహితుడు వాసు సినిమా వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. నరేష్ గారు నిర్మాతగా వస్తున్న ఈ సినిమాకు నా స్నేహితుడు వాసు దర్శకత్వం చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ నెల 18న విడుదల కానున్న కానున్న ఈ సినిమా మంచి విజయం సాధించి అందరికీ మంచి పేరుప్రఖ్యాతులు తీసుకుని రావలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు.




నటుడు ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. ఫస్ట్ కాపీస్ బ్యానర్ ద్వారానే నేను పరిచయం కాబడ్డాను. నాకు గుర్తింపు ఇచ్చిన ఈ బ్యానర్ పై రానున్న మిస్సింగ్ మేఘన సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. మా తంత్ర సినిమాకు పని చేసిన వారు ఈ సినిమాకు పని చేశారు. సినిమాను 18న మిస్ అవ్వకుండా అందరూ చూడాలని కోరుకుంటున్నాను" అన్నారు. సింగర్ సాకేత్ మాట్లాడుతూ... "సినిమాను సపోర్ట్ చేయడానికి వచ్చిన మీడియా వారికి థాంక్స్. సినిమాలో పాటలతో విజువల్స్ కూడా చూసాను. పాటలు, సంగీతం, విజువల్స్ చాలా బావున్నాయి. సినిమాకు సపోర్ట్ చేస్తున్న పెద్ద వారికి థాంక్స్" అన్నారు. నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన తేజ గారికి థాంక్స్. ఒక మంచి కుటుంబ కథను ఎంచుకుని దానిలో అన్ని జోనర్స్ ఇమర్చిన వాచస్పతి గారికి ధన్యవాదాలు. ఈ సినిమాను మంచి మలుపులతో సినిమాను తెరకు ఎక్కించారు. ప్రేక్షకులు అంతా 18వ తేదీన సినిమా చూసి ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు. సంగీత దర్శకుడు ఆర్ ఆర్ ధ్రువన్ మాట్లాడుతూ... "ఈ సినిమా గురించి నేను విన్నప్పుడు సినిమాకు సంగీతం అందించడం కొంచం కొత్తగా అనిపించింది. సినిమాకు మంచి పాటలు అందించాలని అనుకున్నాను. సినిమా కోసం దర్శకులు చాలా కష్టపడ్డారు. సినిమా చాలా ఇంట్రెస్ట్ గా ఉంటుంది. ఈ సినిమాలో పని చేసిన వారితో కలిసి చేయడం చాలా సంతోషం. సినిమాకు బెక్కం వేణు గోపాల్ గారు సపోర్ట్ ఇచ్చారు. అలరాజు గారు మంచి పాటలు అందించారు. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. బెక్కం వేణు గోపాల్ మాట్లాడుతూ... "ఈ సినిమా నరేష్ నిర్మించిన తరువాత నేను చూసాను. సినిమా చూసాక చాలా ఇంట్రెస్ట్ గా అనిపించింది. సినిమాకు సపోర్ట్ చేయాలని అనిపించింది. సెప్టెంబర్ 18న సినిమా విడుదల కాబోతుంది. సినిమాకు అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. నరేష్ కు, వాచస్పతికు ఈ సినిమాతో మంచి విజయం రావాలని కోరుకుంటున్నాను. సినిమాలో నటించిన అంకిత్, రామ్ కార్తీక్ అద్భుతంగా నటించారు. ధ్రువన్ సంగీతం బాగా అందించారు" అన్నారు. చిత్ర దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ... "ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ కు వచ్చిన అందరికీ థాంక్స్. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం కథ. నాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన చిత్ర బృందం అందరికీ థాంక్స్. ఈ నెల 18న విడుదల కానున్న మిస్సింగ్ మేఘన సినిమాకు అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ఇప్పటికి సినిమాకు మంచి ప్రమోషన్స్ తో ముందుకు వెళ్తున్నాము" అన్నారు. నటుడు రామ్ కార్తీక్ మాట్లాడుతూ... "నా తొలి చిత్రం నుండి నాకు సపోర్ట్ చేస్తున్న అందరికీ థాంక్స్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దామోదర్ ప్రసాద్ గారితో చాలా పరిచయం ఉంది, చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత ఆయన. ఈ సినిమాకు సంగీతం అందించిన ధ్రువన్ పాటలు వల్ల సినిమా ప్రేక్షకులకి బాగా వెళ్ళింది. పాటలు పాడిన గాయకులకు థాంక్స్. నేను గతంలో సినిమా చేయడం మిస్ అయిన అయిన అందితో కలిసి ఈ సినిమాలో పని చేయడం చాలా సంతోషం అనిపించింది. నాకు బెక్కం వేణు గోపాల్ గారు మంచి సపోర్ట్ చేస్తూ వచ్చారు. నా తోటి నటుడు అంకిత్ తో పని చేయడం బాగా అనిపించింది. అమ్ము అభిరామి తో ఇది నా రెండవ సినిమా. దర్శకులు ఈ సినిమాకు చాలా కష్టపడి పని చేశారు. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. 18న మిస్సింగ్ మేఘన సినిమాను అందరూ చూడాలని కోరుకుంటున్నాను" అన్నారు. నటుడు అంకిత్ కొయ్య మాట్లాడుతూ... "సంవత్సరం తర్వాత మీడియా ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు థాంక్స్. నేను ఇక్కడ ఉండటానికి కారణం దర్శకుడు వాచస్పతి గారు, ఆయన ఈ సినిమా కోసం చాలా కష్టపడి పని చేశారు. సినిమాకు పని చేసిన బృందానికి, నిర్మాతలకు థాంక్స్. రామ్ కార్తీక్ తో పని చేయడం చాలా సంతోషం అనిపించింది. మీడియా తలుచుకుంటే ఏం చేయగలరో నా గత సినిమాలకు నేను చూసాను, ఈ సినిమాకు కూడా మీడియా మంచి సపోర్ట్ ఇవ్వాలని కోరుకుంటున్నాను" అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ... "నేను ఈ సినిమాకు సపోర్ట్ చేయడానికి ముఖ్య కారణం రామ్ కార్తీక్. ఈ సినిమాకు పనిచేసిన వాళ్ళు నాతో గతంలో పని చేశారు, వారు మంచి టాలెంట్ ఉన్న వ్యక్తులు. ఒక నిర్మాతకు కాన్ఫిడెన్స్ చాలా ముఖ్యం, సినిమా విడుదల తేది వరకు గట్టిగా నిలబడాలి. సినిమా అంటే డబ్బు కాదు, కొంత మంది జీవితం. ఎటువంటి కష్టం వచ్చినా సినిమా కోసం నిలబడాలి. చిన్న సినిమాలకు అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సెప్టెంబర్ 18న విడుదల కానున్న కంటెంట్ ఉన్న ఈ సినిమాకు మీడియా నుండి మంచి సపోర్ట్ వచ్చి సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

క్యాస్ట్ : రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య, గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు

టెక్నీకల్ టీం :
ప్రొడ్యూసర్: పంచుమర్తి నరేష్ బాబు
కో-ప్రొడ్యూసర్: దివేల శ్రీనివాస్ రావ్
బ్యానర్ నేమ్: ఫస్ట్ కాపి మూవీస్, కేడిడకో
దర్శకత్వం: వాచస్పతి
కథ & స్క్రీన్‌ప్లే: వనరాజ్
సంభాషణలు: వెంకటి బద్దిగం
సంగీతం: ఆర్.ఆర్.ధృవన్
ఛాయాగ్రహణం: శామ్. కె. నాయుడు
ఎడిటింగ్: బసవా
కొరియోగ్రాఫర్: జేడీ, ఈశ్వర్ పెంటి
ఫైట్స్: రామకృష్ణ, స్టంట్ శంకర్
లిరిక్స్: ఆర్.ఆర్. ధృవన్, అలరాజు
పిఆర్వో: సోమిశెట్టి నాగేశ్వర రావ్ (నానీ=), తిరుమలశెట్టి వెంకటేష్

# "కింగ్డమ్" సినిమాకు బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ గా సైమా అవార్డ్ అందుకున్న హీరో సత్యదేవ్ కు శుభాకాంక్షలు తెలిపిన "ఎస్ డి 15" టీమ్

జన తెలంగాణ సినిమా



యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్ రీసెంట్ గా జరిగిన సైమా అవార్డ్స్ లో బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ గా అవార్డ్ అందుకున్నారు. ఇది ఆయనకు ఫస్ట్ సైమా అవార్డ్. కింగ్డమ్ సినిమాలో నటనకు గానూ సత్యదేవ్ ను ఈ అవార్డ్ వరించింది. ఈ నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది "ఎస్ డి 15" మూవీ టీమ్. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న ఈ 15వ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. కింగ్డమ్ సినిమాలో హీరో విజయ్ దేవరకొండ సోదరుడిగా శివ పాత్రలో సత్యదేవ్ నటించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. "ఎస్ డి 15" సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ తో దర్శకుడు లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియా అబ్బిల్లా నాయికగా నటిస్తోంది. ఈ సినిమా నటుడిగా సత్యదేవ్ లోని కొత్త కోణాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతోంది.

# అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీవాస్, గౌతమ్ తిన్ననూరి, రశ్మిక మందన్న, అనిరుధ్ ల కలయిక లో భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ అనౌన్స్ మెంట్

జన తెలంగాణ సినిమా

తన అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే భారీ ప్రయత్నం ప్రారంభించారు విజనరీ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బులక్ష్మిగా నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ రోజు ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ వేదికగా ఈ చిత్ర అనౌన్స్ మెంట్ ఘనంగా చేశారు.తన నట ప్రతిభతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న హీరోయిన్ రశ్మిక మందన్న ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్రలో జీవించబోతున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్ అనౌన్స్ మెంట్ సంగీత ప్రియుల్లో ఆనందాన్ని నింపుతోంది. వరల్డ్ క్లాస్ మేకింగ్, హై టెక్నికల్ వ్యాల్యూస్ తో ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

నటీనటులు - రశ్మిక మందన్న, తదితరులు
టెక్నికల్ టీమ్
--------------------
మ్యూజిక్ - అనిరుధ్ రవిచందర్
ప్రొడ్యూసర్స్ - అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీవాస్
డైరెక్టర్ - గౌతమ్ తిన్ననూరి

అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీవాస్, గౌతమ్ తిన్ననూరి, రశ్మిక మందన్న, అనిరుధ్ ల కలయిక లో భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ అనౌన్స్ మెంట్

జన తెలంగాణ సినిమా




తన అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే భారీ ప్రయత్నం ప్రారంభించారు విజనరీ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బులక్ష్మిగా నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ రోజు ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ వేదికగా ఈ చిత్ర అనౌన్స్ మెంట్ ఘనంగా చేశారు.తన నట ప్రతిభతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న హీరోయిన్ రశ్మిక మందన్న ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్రలో జీవించబోతున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్ అనౌన్స్ మెంట్ సంగీత ప్రియుల్లో ఆనందాన్ని నింపుతోంది. వరల్డ్ క్లాస్ మేకింగ్, హై టెక్నికల్ వ్యాల్యూస్ తో ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు
నటీనటులు - రశ్మిక మందన్న, తదితరులు
టెక్నికల్ టీమ్
మ్యూజిక్ - అనిరుధ్ రవిచందర్
ప్రొడ్యూసర్స్ - అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీవాస్
డైరెక్టర్ - గౌతమ్ తిన్ననూరి

# వినాయక చవితి సందర్భంగా అజయ్ అరసాడ 'బోలో గణపతి S/O ఉమాపతి' స్పెషల్ సింగిల్ విడుదల

జన తెలంగాణ సినిమా

'ఆయ్', 'సేవ్ ది టైగర్స్', 'వికటకవి', 'గుర్తుకొస్తున్నాయి' వంటి ప్రాజెక్ట్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు అజయ్ అరసాడ వినాయక చవితి సందర్భంగా 'బోలో గణపతి S/O ఉమాపతి' పేరుతో ప్రత్యేక సింగిల్‌ను నేడు విడుదల చేశారు. ఈ పాటకు అజయ్ అరసాడ సంగీతం అందించడంతో పాటు, తన మ్యూజిక్ లేబుల్ 'ూహూ =వచీతీం'పై స్వయంగా నిర్మించారు. విశాఖపట్నానికి చెందిన అజయ్ అరసాడ సంగీత నేపథ్యంతో పాటు టీసీఎస్‌లో ఏడు సంవత్సరాలు పనిచేసిన అనంతరం సినీ సంగీత రంగంలోకి అడుగుపెట్టారు. విభిన్న జానర్స్‌లో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ ను, ఇటీవల పవన్ కళ్యాణ్ గారు వ్యక్తిగతంగా కలిసి అభినందించడంతో పాటు, భవిష్యత్తులో కలిసి పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేయడం విశేషం.తాజాగా విడుదలైన 'బోలో గణపతి S/O ఉమాపతి' పాటను అజయ్ అరసాడ కేవలం రెండు రోజుల్లోనే కంపోజ్ చేశారు. గణపతిని ఉత్సాహభరితంగా, యూత్‌ఫుల్‌గా సెలబ్రేట్ చేసేలా రూపొందించిన ఈ పాటను జయరామ్ పైలా, సింధూర రాజేష్ ఎనర్జిటిక్‌గా గానం చేయగా, భాస్కర్ తిరుమల సింపుల్‌గా, ట్రెండీగా, అర్థవంతమైన సాహిత్యాన్ని అందించారు. లిరికల్ సాంగ్ లో సాంగ్ కంపోజిషన్ ను చూపిస్తూ మధ్యలో లిరిక్స్ తగ్గట్టు ఉండే గణేష్ మహారాజ్ పెయింటింగ్ ఫ్రేమ్స్ రావడం ఆకట్టుకుంటుంది. ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచేది డివోషనల్ సాంగ్ కు ఇచ్చిన ట్రెండీ టచ్. తెలుగు సాహిత్యం తో సంస్కృత పదాలతో పాటూ సహజంగా ఇమిడిపోయే ఇంగ్లీష్ పదాన్ని మేళవిస్తూ రూపొందించిన ఈ పాట వినూత్నమైన అనుభూతిని అందిస్తుంది. క్యాచీ లిరిక్స్, పెప్పీ బీట్, ఎనర్జిటిక్ వోకల్స్‌తో జెన్ జీ తో పాటు పెద్దలను కూడా ఆకట్టుకునేలా 'బోలో గణపతి S/O ఉమాపతి' రూపొందింది.భక్తి, ఉత్సాహం, ఆధునిక సంగీత శైలిని కలిపిన ఈ పాట గణేష్ చతుర్థి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వినాయక ఆకట్టుకునే ఎనర్జీ, ఒక హ్యాపీ వైబ్ తో సాగే ట్రెండీ లిరిక్స్, గణపతిని కొత్త తరహాలో సెలబ్రేట్ చేసే విధానం 'బోలో గణపతి S/O ఉమాపతి' పాటకు ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. అజయ్ అరసాడ నిర్మాతగా మారి ప్రారంభించిన 'ూహూ =వచీతీం' కి ఘనమైన ప్రారంభాన్ని ఇచ్చింది.

పాట : బోలో గణపతి S/O ఉమాపతి
సంగీతం : అజయ్ అరసాడ
సాహిత్యం : భాస్కర్ తిరుమల
గాయకులు : జయరామ్ పైలా, సింధూర రాజేష్
రిథమ్స్ : సాయిరామ్ పైలా
కీబోర్డ్ ప్రోగ్రామింగ్ : జయరామ్ పైలా
నాదస్వరం : మల్లికార్జున్
నిర్మాత : అజయ్ అరసాడ
కెమెరా : శ్రీకర్ (మోఖిన్జుషీబలీవం)
కాన్సెప్ట్ & ఎడిటింగ్ : వెంకట్ చిక్కాల
పీ ఆర్ ఓ : ఇండస్ట్రీహిట్ శివ
స్టూడియో & లేబుల్ : ూహూ =వచీతీం

# 'రా కింగ్' మంచు మనోజ్ "డేవిడ్ రెడ్డి" సినిమా నుంచి నటి రమ్యకృష్ణ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

**"డేవిడ్ రెడ్డి" చిత్రంలో కమల రెడ్డి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్న రమ్యకృష్ణ**

జన తెలంగాణ సినిమా

'రా కింగ్' మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా "డేవిడ్ రెడ్డి". ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా "డేవిడ్ రెడ్డి" సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మారియా ర్యబోష్యప్క హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ రోజు నటి రమ్యకృష్ణ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ "డేవిడ్ రెడ్డి" సినిమా నుంచి ఆమె బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కమల రెడ్డి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. ఈ పోస్టర్ లో ఆమె ఖడ్గంతో శత్రువులను తుదముట్టించి తన ఆసనంపై కూర్చుని ఫెరోషియస్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. రమ్యకృష్ణ కెరీర్ లో కమల రెడ్డి పాత్ర ఒక ఐకానిక్ క్యారెక్టర్ గా గుర్తుండిపోనుంది.

నటీనటులు - 'రా కింగ్' మంచు మనోజ్, మరియా ర్యబోష్యప్క, రమ్యకృష్ణ, ఆర్. పార్థీబన్, కాంచన, తదితరులు
టెక్నికల్ టీమ్
ఆర్ట్ - రవి జక్కుల,కాస్ట్యూమ్స్ - హైందవి సుధ

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775